ప్రేమను జనింపజేస్తుంది. ద్వేషం ఎదుటివారిలో ద్వేషాన్ని రగుల్చుతుంది. శాస్త్రజ్ఞులకు ప్రేమ ఫలితం తెలియునుగానీ, ప్రేమ తెలియదు. అందుకే ప్రేమించుగానీ, ప్రేమను గూర్చి అతిగా వ్యాఖ్యానించవద్దంటారు. ప్రేమ పిచ్చాసుపత్రులను ఖాళీ చేస్తుంది. కారాగారాల అవసరాలను నిర్మూలిస్తుంది. ఆరోగ్య కేంద్రాల ఆవశ్యకతను నిర్మూలిస్తుంది. సూర్య భగవానుడు పువ్వును వికసింపజేస్తే - ప్రేమ హృదయాలను కదిలిస్తుంది. కరగిస్తుంది. మనుజులలో మానవత్వాన్ని మేల్కొలుపుతుంది.

మనము ఒకరికి నమస్కరించడంలో మన మనస్సుకు చెప్పలేనంత ఆనందం చేకూరుతుంది. ప్రేమను పెంచడం, పంచడం, ఎదుటి వారి హృదయస్పందన కొరకే కదా! మనం పెరగాలి - మనకు నచ్చిన, మనం మెచ్చిన సద్విషయ సంపదను మనం ఆస్వాదించాలి; అందరికీ పంచాలి; బ్రతుకును సార్థకం చేసుకోవాలి. తెలివిగా మనం చేసిన పని ఖచ్చితంగా మనకు అంతులేని ఆనందాన్ని చేకూర్చుతుంది. అప్పుడు మన హృదయంలో ఆనందకెరటాలు రేయింబవళ్ళూ ఉరకలెత్తుతాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి కనిపించదు.

భూతకాలం నశించిపోయింది; గతంలో విషయాలను తవ్వుకోవడం నిరర్థకం. భవిష్యత్తును గూర్చి తర్కించుకోవడం అనర్థకం. వర్తమానంలో జీవిస్తున్నాం, మనం చేస్తున్న మంచి పనులు, పరోపకారం, ప్రేమభావం, మనకి లభించే విజయపరంపరలు మనకు ఆనందహేతువులే కదా! వర్తమానంలో మన కృషి ఫలించాలి - ఫలిస్తుంది. “కృషితో నాస్తి దుర్భిక్షం” అన్నది ఆర్యోక్తి. మన కృషి సత్ఫలితాలిస్తే మనకు ఆనందదాయకమే కదా! రాళ్ళకు మొక్కేటప్పుడు రాళ్ళలో దాగివున్న భగవత్‌తత్వాన్ని గ్రహించాలి. సకల జీవులలో వున్న ఆత్మను ప్రేమించాలి, సేవించాలి, ఆనందానుభూతిని పొందాలి.





# మాతృసంస్థ కబుర్లు

నవంబర్ 25వ తేదీ శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు మూలస్థంభాలలో ఒకరైన పూజ్యశ్రీ మాతా శుకవాణి (మాతాజీ) గారి 81వ జన్మదినం జరుపుకున్నాం. సమాజమే నాది. అనాథ పిల్లలే నా సొంత పిల్లలు అని ఎందరో జీవితాలలో ఆశా జ్యోతులను వెలిగించి సన్మార్గాన్ని చూపించిన ప్రేమ మూర్తి మన నుండి శారీరకంగా దూరమై ఏడు సంవత్సరాలు కావొస్తుంది. వారు దేనికోసమైతే పరితపించారో అదే మార్గంలో సాయిధామం ఆశ్రమం నడుస్తున్నది. ఇలాంటి త్యాగమూర్తుల స్ఫూర్తితో వారు నడిచిన మార్గంలో ముందు తరాలు నడవాలి.

24వ తేదీన స్ఫూర్తిధామాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి 25వ తేదీ ఉదయం గం.7.00లకు స్ఫూర్తిధామంలోని శ్రీ మాతాజీ పాలరాతి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నూతన వస్త్రాలతో అలంకరించి 81 దీపాలతో దీపాలంకరణ చేసారు. వారు దాదాపు 55 సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా ఎంతోమంది విద్యార్థులకు సత్యం, త్యాగం, దేశభక్తి లాంటి విలువలు పెంపొందింపజేసి మంచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఆమె సొంతం.

ఉదయం గం.11.00లకు శ్రీ సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు సాయి చాలీసా పారాయణ చేసి, దీపాలంకరణలో పాల్గొని, పూజ్య మాతాజీగారి గతకాలపు మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సాయిదత్త పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారు మాతాజీగారి యొక్క సహనాన్ని, ఓర్పుని, త్యాగమయ జీవితాన్ని వివరించి ఆ తల్లి ఋణం తీర్చుకోలేమని అన్నారు.

అనంతరం పూజ్య మాతాజీ స్వ హృత్యర్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో 150 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది.

సాయి విద్యాధామం 1994లో ప్రారంభమైనప్పటి నుంచి 2016 ఆగస్టు 20వ తేదీ వరకు శ్రీ మాతా శుకవాణిగారు ప్రధానోపాధ్యాయులుగా, కరస్పాండెంట్‌గా మరియు సాయిధామం ఆశ్రమ ధర్మాధికారిగా ఇతోధికంగా సేవలందించినారు. అందువల్ల వారి జన్మదినం ప్రతీ సంవత్సరం నవంబరు 25నే పాఠశాల వార్షికోత్సవం జరుపుటకు నిశ్చయించడమైనది.

మధ్యాహ్నం గం.3.00లకు శ్రీ సాయి విద్యాధామం పాఠశాల 29వ వార్షికోత్సవం కళ్యాణి ఆడిటోరియంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఆశ్రమంలో మంచి మంచి కార్యక్రమాలు జరుగుతుంటే ఓర్చుకోలేని కొన్ని దుష్టశక్తులు ఉంటాయి. అందుకని విద్యార్థుల తల్లిదండ్రుల రక్షణ దృష్ట్యా ఐ.డి, పాస్ పద్ధతి ద్వారానే ప్రవేశం కల్పించడం జరిగింది. విద్యార్థులతో, తల్లిదండ్రులతో ఆడిటోరియం అంతా కోలాహలంగా, పండుగ వాతావరణంలా తయారయ్యింది. అందరిలో ఆనందం, ఉత్సుకత వచ్చి మా పిల్లలు ఎప్పుడెప్పుడు వాళ్ల ప్రదర్శనలు ఇస్తారా ఆతృతగా ఉన్నారు.

శ్రీ విశ్వ కళా పరిషత్ ఛైర్మన్ గారైన శ్రీశ్రీశ్రీ రామానంద ప్రభుజీ వారు అధ్యక్ష పీఠం అలంకరించగా, ఆనాటి ముఖ్యఅతిథి శ్రీమతి ఆచార్య సవితాదేవి (నాగారంలోని పాణిని కన్యా గురుకులం వేద పాఠశాల వ్యవస్థాపకరాలు) గారినీ, ట్రస్టు సభ్యులు శ్రీ చంద్రారెడ్డి, శ్రీ బుచ్చిరెడ్డి, శ్రీ గోపీకృష్ణ  గారి ఆహ్వానాలతో కార్యక్రమం మొదలయ్యింది.

ఆచార్య సవితాదేవి గారు తమ ప్రవచనంలో "తల్లిదండ్రులను, విద్యార్థులను ఉద్దేశించి ఒక సంస్థ నడవాలంటే ఎన్నో వ్యయప్రయాసలకు





ఓర్చుకోని ఒక చిన్న కుటుంబాన్నే నడపలేకపోతున్న మనం ఇంత పెద్ద ఆశ్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుంటే అదంతా స్వామీజీ కృషి, వారి శక్తి అని చెప్పకోవాలి. వారి శ్రమ వెనకాల ఉన్న ధ్యేయాన్ని మీరు గుర్తించాలి. ఇంత మంచి ఆశ్రమంలో ఉచితంగా చదువుకోవడం మీ అదృష్టం. మీరు ఆధ్యాత్మికంగా, నైతికంగా, సమాజం విలువలను మరువకుండా మీ తల్లిదండ్రులకు, మీ పాఠశాలకు మంచి పేరు తెస్తారని ఆశిస్తాను" అంటూ ముగించారు.

అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీవారు తల్లిదండ్రులను ఉద్దేశించి ఉపన్యసించారు. ఒక మొక్క ఎదగాలంటే దానికి ఎరువు, నీళ్లు, కంచె, కాపలా అన్నీ అవసరం. మొక్కై వంగనిది మానై వంగుతుందా- అనే సామెత ఉంది. మొక్క చిన్నగా ఉన్నప్పడే సరిచేస్తాము. పిల్లలు కూడా అంటే చిన్నతనంలో మనం గట్టిగా కోప్పడి సరిచేయకపోతే వారి జీవితాన్ని మనమే చెడగొట్టిన వాళ్లం అవుతాం. పిల్లలలో నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తుంది. తల్లిదండ్రులు ప్రతి క్షణం పిల్లలు ఇంట్లో ఉన్నప్పడు వారి నడవడికను గమనిస్తూ దిశా నిర్దేశం చేయాలి. ఈ పాఠశాల నాది అనే బాధ్యత, భావన ఉండాలి. చిన్ననాట తల్లిదండ్రులు నేర్పిన సంస్కారమే జీవితాంతం తోడుంటుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి నడిస్తేనే విద్యార్థి భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది. అందరూ దీనికోసం కృషి చేస్తారని ఆశిస్తున్నాను అని ముగించారు.

ఎప్పడెప్పడా అని ఎదురుచూస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కాబోతున్నాయి. ముందుగా వచ్చిన అతిథులను స్వాగతించడం మన సంప్రదాయం కదా. అందుకని మొదటగా స్వాగతం .... స్వాగతం .... అంతా నిర్విఘ్నంగా జరగాలనీ విఘ్నేశ్వరుని కూచిపూడి నృత్య ప్రదర్శన అనంతరం నాటకాలు, నాటికలు, జానపద నృత్యాలు, దేశ భక్తి పాటలు

మొదలైనవి ఎంతో ఆనందాన్నీ, ఉత్సాహాన్ని ఇచ్చాయి. ముఖ్యంగా శివ శివ హర హర .... నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

ఆడపిల్ల అంటే అబల కాదు సబల. అన్ని రంగాలలో పురుషుడి కంటే ముందుగా ఎన్నో విషయాలను సాధించగలదు అని నిరూపించిన వారు స్త్రీలు. పాణిని కన్యా గురుకులం వేద పాఠశాల విద్యార్థినులు "భరత వేదము" పాటకు నుదుట దీపాలను ధరించి చేసిన యోగాసనాలను వీక్షించిన ప్రేక్షకులు ఆనందోత్సాహాన్ని పొందారు. ఆడిటోరియం కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది. వారి ప్రదర్శనకు మెచ్చి ఆశ్రమ ట్రస్టు సభ్యులైన శ్రీ చంద్రా రెడ్డిగారు రూ.10,116/లు, స్వామీజీ రూ.5,116/-లు, మరికొంతమంది భక్తులు కన్యా గురుకులానికి బహుమతిగా అందించారు. ఆచార్య సవితా దేవిగారిని శాలువా, మెమెంటోతో సత్కరించారు ఉపాధ్యాయులు.

అనంతరం సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థులకు వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, రంగవల్లికల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది.

గత సంవత్సరం మార్చి 2022 ఎస్.ఎస్.సి. బోర్డు నిర్వహించిన పరీక్షలో సాయి విద్యాధామం విద్యార్థిని చి॥ కుసుమ భానుతేజ ప్రథమ స్థానంలో నిలిచినందున శాలువా, నగదుతో సత్కరించడం జరిగింది. 2022-23 సంవత్సరం 10వ తరగతి చదువుతున్న చి॥ పి.హారికను పాఠశాలలో అన్నీ రంగాలలో ముందుంటు అందరికీ ఆదర్శంగా నిలిచినందున ఉత్తమ విద్యార్థిగా తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించడం జరిగింది. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు 29వ వార్షికోత్సవ జ్ఞాపికను శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు బహూకరించారు.

దత్తాత్రేయుని జన్మదినాన్ని మార్గశిర పౌర్ణమి రోజున దత్త జయంతి





జరుపుకుంటారు. ఇది చాలా పరమ పవిత్రమైన రోజుగా పరిగణించబడుతుంది. అత్రి మహాముని, మహా పతివ్రత అయిన అనసూయల సంతానమే దత్తాత్రేయుడు. ఈయన త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అంశలతో జన్మించిన అవతారమూర్తి.

స్వస్తిశ్రీ శుభకృత్ నామ సంవత్సరం మార్గశిర శుద్ధ పౌర్ణమి (దత్త జయంతి) బుధవారం 07-12-2022న మన సాయిధామంలో ఏకాహ్నికా దీక్షా విధానంతో అష్టోత్తర శత కుండాత్మక శ్రీ దత్త మహా యాగము శ్రీ సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ త్రిగుళ్ళ మాధవశర్మ వారి మిత్రబృంద పర్యవేక్షణలో లోకకళ్యాణార్థం జరుపుటకు సంకల్పించడమైనది..

ఈ మహాయజ్ఞానికి నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు మొదలయినాయి. దత్తాత్రేయుల వారి అనుగ్రహంతో ఈ సంవత్సరం ప్రశాంతంగా, ఆనందంగా జరిగింది. నూట ఎనిమిది కుండాల నిర్మాణానికి ముగ్గు పోయడం, కుండాల నిర్మాణం, అలకడం, ముగ్గులు వేయడం చకాచకా జరిగినాయి. జెండాలు కట్టడం, రోడ్లకు ఇరువైపుల ముగ్గుపోయడం ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు పూనుకున్నారు. సత్తెనపల్లి శాఖ నుండి వచ్చిన భక్తులు యాగశాలను పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, ఆశ్రమ వాసులు, భక్తులు అన్ని పనులను బాధ్యతగా నిర్వహించారు. తెనాలి వాస్తవ్యులైన ఆశ్రమ ట్రస్టు సభ్యులైన శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణ, మాధురీ గార్లు మధురమైన లడ్డు ప్రసాదాన్ని అందించారు. యజ్ఞానికి ముందు రోజు రాత్రి గం.2.00ల వరకు వచ్చిన కార్యకర్తలంతా యాగశాలను, భక్తులకు కావలసిన అన్నీ ఏర్పాట్లను పూర్తి చేసారు.

07-12-2022 ఉదయం గం.6.00లకే మంగళవాద్యాలు, దత్తాత్రేయ

మంత్రోచ్ఛారణ ప్రారంభమయ్యింది. శ్రీ త్రిగుళ్ళ మాధవ శర్మగారి మిత్ర బృందం గం.8.00 ల కల్లా విచ్చేసారు. 10 గం.లకు శ్రీ దత్తాత్రేయుల వారికి షోడశోపచార పూజ నిర్వహించి స్వామి వారికి మకరతోరణం ఆవిష్కరించారు స్వామీజీ. 11 గం.లకు యాగశాల ప్రాంగణం అంతా వేదమంత్రాలతో, సాధు సత్పురుషులతో పావనమైంది. 11 గం.లకు యాగశాల ప్రవేశము, అగ్ని ప్రతిష్ఠా, శ్రీ గణపతి హోమము, నవగ్రహ హోమము, శ్రీ దత్తాత్రేయ మూల మంత్ర గాయత్రీ హోమములు, యాగ్నికుల స్వాహాకారాలతో యాగశాల పవిత్రమైనది. ప్రతి మంత్రానికి వివరణ ఇస్తూ యజ్ఞం జరిపించారు యాగ్నికులు.

మధ్యాహ్నం గం.12.00లకు శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలానంద యోగ భారతి మాతాజీ గారి అనుగ్రహ భాషణం జరిగినది. దత్తాత్రేయుల వారి హోమ విశిష్టతను గురించి వివరించారు. ఒక్క యజ్ఞం మాత్రమే. సమస్త జీవకోటికి ప్రసన్నతను ఇవ్వగలిగేది. యజ్ఞముతో శరీరము, ప్రకృతి రెండు శుద్ధి అయి వ్యక్తిని, సమాజాన్ని దైవీ భావాల దిశగా ప్రేరేపించేది యజ్ఞం. యజ్ఞం వలన పర్యావరణా కాలుష్యాన్ని శుద్ధి చేస్తుందని, అది జరిగిన ప్రదేశం చుట్టు ప్రక్కల మొక్కలు, జంతువుల ప్రవర్తనలో సానుకూలమైన మార్పు కనిపిస్తుంది. ఎదుగుదల త్వరితగతి అవుతుందని వేదం స్పష్టం చేసిందని వివరించారు.

అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. దీక్షాధారులకు ఆశీర్వచనం అనంతరం యజ్ఞం చేసుకున్న వారందరికీ ఆశ్రమం తరపున సాయిదత్త పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారు ఆశీర్వదిస్తూ యజ్ఞ ప్రసాదాన్ని అందించారు..

అనంతరం పూజ్య స్వామీజీ వారు దత్తాత్రేయుల వారి గురించి దివ్య ప్రవచనం చేసారు. దత్తాత్రేయుల వారి అవతార కార్యమే సంస్కార కార్యం.





ప్రజలందరూ దుర్మార్గపు ఆలోచనల నుండి వారు సంస్కారవంతులు కావాలి అంటే అది దత్తాత్రేయుల వారి సంపూర్ణ అనుగ్రహంతోనే సాధ్యం. త్రిమూర్తుల అవతారమే దత్తాత్రేయుల వారు. పూజ్య స్వామీజీ శ్రీశ్రీశ్రీ సత్య పదానంద ప్రభుజీ ప్రజలందరినీ సన్మార్గం వైపు నడపడం కోసం, క్రమశిక్షణా కల్గించడం కోసం, సనాతన ధర్మాన్ని పరిరక్షించడం కోసం, హిందూ ధర్మాన్ని కాపాడటం కోసం ఈ సాయిధామం ఆశ్రమంలో సాయి దత్త పీఠం ఏర్పాటు చేసారు.

ఈ మహా కార్యక్రమంలో ఆర్థికంగా, హార్థికంగా సహాయ సహకారాలు అందిన భక్తులందరికీ దత్తాత్రేయుల వారి పరిపూర్ణ ఆశీస్సులు ఉంటాయని సాయివాణి మనసారా వేడుకుంటుంది.

డిసెంబర్ 18వ తేదన సాయిధామంలోని కళ్యాణి ఆడిటోరియంలో పెళ్లి సందడి జరిగింది. ఒక పుష్కరం పాటు సాయి విద్యాధామం పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి పాఠశాలలో బాధ్యత గల ఉపాధ్యాయురాలిగా నిస్వార్థంగా, సహనంతో పనిచేసి అందరి మన్ననలు అందుకున్న కుమారి మధుశ్రీకి వివాహం జరిగి శ్రీమతి శ్రీ మధుశ్రీ ఉదయ గౌడ్‌గా మారింది.

పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి దివ్యాశీస్సులతో - పూజ్య మాతాజీ ప్రేమాశీస్సులతో సాయిధామం సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ఆశీస్సులతో వైభవంగా కళ్యాణం జరిగింది. నూతన వధూవరులిద్దరూ సత్సంతానాన్ని కని లోకోపకారానికి సహకరించాలనీ, ఎన్నో విజయాలు సాధించి వారి దాంపత్యం నిండు నూరేళ్లు చల్లగా వర్థిల్లాలని సాయివాణి మనసారా ఆశీర్వదిస్తున్నది.